సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం ‌। 26 ।మార్చి । 2024



వైభవంగా రథోత్సవం 8లో

వై రామవరం మండలం బొడ్డుగండి పంచాయతీ డొంకరాయి గ్రామంలో కుమార స్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



ఘనంగా వెంకన్న కల్యాణం

వెంకటరెడ్డిపేటలో వేంకటేశ్వర స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం హోలీ పౌర్ణమి సందర్భంగా వైభవంగా జరిగింది. 8లో

రంజాన్ వేళలు

పాడేరు, అరకు

	ఇఫ్తార్ (మంగళ)	సహర్ (బుధ)
పాడేరు, అరకు	6.12	4.40
రంపచోడవరం	6.27	4.46

న్యూస్‌రీల్

అమ్మను తాకిన ఆదిత్యుని కిరణాలు



మోదకొండమ్మతల్లిని తాకిన సూర్యకిరణాలు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి విగ్రహాన్ని సోమవారం సూర్యోదయం సమయంలో సూర్యకిరణాలు తాకాయి. సూర్య కిరణాల కాంతిలో అఖండ తేజస్సుతో మోదమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారి సుబ్రహ్మణ్యం ప్రత్యేక పూజలు చేశారు.

వేసవిలో మంచు దుప్పటి



ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో పొగ మంచు

హుకుంపేట: జిల్లాలో రెండు రోజుల నుంచి వింత వాతావరణం నెలకొంది. ఉదయం దట్టంగా పొగమంచు కురుస్తుండగా, మధ్యాహ్నం ఎండలు మండిస్తున్నాయి. సాయంత్రం ఆకాశం మేఘావృతమై అక్కడక్కడ చిరు జల్లులు పడుతున్నాయి. సోమవారం పలు ప్రాంతాల్లో దట్టంగా పొగమంచు కురిసింది. వేసవి కాలం ప్రారంభమైనప్పటికీ ఉదయం 8 గంటల వరకు మంచు తెరలు వీడలేదు. మంచు అందాలు అబ్బురపరిచాయి.

ఫోర్జరీ, చీటింగ్.. ఇంకా..



- ఉమ్మడి విశాఖలో కూటమిలోని ముగ్గురు ఎంపీ అభ్యర్థులపై ఆరోపణలు
- భూఆక్రమణకు పాల్పడిన విశాఖ టీడీపీ ఎంపీ అభ్యర్థి భరత్ ఫ్యామిలీ
- అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌పైనా పలు కేసులు
- అరకు బీజేపీ ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతపై బ్యాంక్ రుణాల ఎగవేత కేసు

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడు ఎంపీ స్థానాల్లో బరిలోకి దిగుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు పలు కేసులు ఎదుర్కొంటున్నారు. భూకబ్జా, ఫోర్జరీ, రుణాల ఎగవేత వంటి కేసులు వారిని వెంటాడుతున్నాయి. అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌పై ఫోర్జరీ కేసు, అరకు బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి కొత్తపల్లి గీతపై బ్యాంక్ రుణాల ఎగవేత కేసు, విశాఖ టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ కుటుంబంపై భూఆక్రమణ కేసులు ఉన్నాయి. వీరిపై తవ్వే కొలదీ అవినీతి, ఆక్రమణలు బయటకు వస్తున్నాయి. ఇలా పలు ఆరోపణలు ఉన్న వీరు చట్టసభలకు పోటీ చేస్తుండడంపై జనాలు విస్తుపోతున్నారు. వీరు తీరు ఇప్పుడు 'ముగ్గురూ ముగ్గురే' అన్నట్లు ఉంది.

వెంటాడుతున్న గీతం భూ ఆక్రమణల కేసు



అక్రమాల పునాదులపై విశ్వవిద్యాలయాన్ని తన కుటుంబీకులు నిర్మిస్తున్నా.. ఆపకుండా ప్రోత్సహించిన చరిత్ర విశాఖ టీడీపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ది. అక్రమ కట్టడాలు, భూఆక్రమణలతోనే గీతంని విస్తరించారనే ఆరోపణలు నిజమని ప్రభుత్వాధికారుల స్వాధీనంతో నిరూపితమయ్యాయి. గతంలో ఆ వివాదాస్పద వ్యవహారాలన్నీ ప్రస్తుత గీతం వర్సిటీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న ఎం.భరత్‌ని వెంటాడుతున్నాయి. గీతం కళాశాల తొలుత పాతిక ఎకరాల్లో ఏర్పాటైంది. ఆ తర్వాత క్రమక్రమంగా ప్రభుత్వ భూములను కబ్జా చేసుకుంటూ 110 ఎకరాల విస్తీర్ణంలో డీమ్డ్ యూనివర్సిటీ స్థాయికి చేరింది. ఈ సంస్థ ఆధీనంలో ఉన్న 35 ఎకరాల భూములను లీగల్‌గా కైవసం చేసుకునేందుకు అప్పటి కలెక్టర్ ద్వారా 2012 మే 28వ తేదీన ఎలినేషన్ ప్రతిపాదనలు పంపించగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాటు తొక్కిపెట్టింది. ఈ భూముల్ని దళిత విద్యార్థుల కళాశాల, **పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్, బలహీన వర్గాల గృహనిర్మాణం, అధికారులకు రెసిడెన్షియల్ క్వార్టర్స్, ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ రీజనల్ సెంటర్ ఇలా వివిధ ప్రభుత్వ అవసరాల కోసం కేటాయిస్తున్నట్లు 2014 ఫిబ్రవరి 28వ తేదీన అప్పటి** ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు ఉత్తర్వులు జారీ చేసినా.. గీతం యాజమాన్యం వాటిని వదల్లేదు. గీతం ఆక్రమించిన 40.52 ఎకరాల భూముల విలువ ఇప్పుడు రూ.500 కోట్ల పైమాటే. ఇక కేబినెట్ ఆదేశాలు, కోర్టు ఉత్తర్వులు ఎలా ఉన్నప్పటికీ ఈ భూములు 2019 వరకూ గీతం ఆధీనంలోనే ఉన్నాయి.

గీతం మూర్తి చేసిన సంస్థాగత తప్పుల గురించి తెలిసినా.. తప్పు అని చెప్పకుండా.. ప్రోత్సహించిన భరత్‌ని.. ఆ పాపాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఇప్పటికే ప్రభుత్వం 40 ఎకరాల వరకూ గీతం ఆక్రమిత భూముల్ని స్వాధీనం చేసుకుంది. అయినా.. తమదేం తప్పులేదంటూ భరత్ మొసలి కన్నీరు కారుస్తూ.. కబ్జా భూమిలో కొంత భాగం తన వర్సిటీలోనే ఉంచేసుకున్నారు.

రుణాల ఎగవేత నుంచి కుల అనర్హత కేసు వరకు..



2014లో వైఎస్సార్ సీపీ తరఫున అరకు ఎంపీగా గెలుపొందిన కొత్తపల్లి గీత ప్రలోభాలకు లోనై కొద్ది రోజులు టీడీపీకి దగ్గరయ్యారు. 2018లో జనజాగృతి పేరిట రాజకీయ పార్టీని నెలకొల్పారు. 2019 ఎన్నికల అనంతరం ఆ పార్టీని బీజేపీలో విలీనం చేశారు. ఆమెపై పలు కేసు ఉన్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి రూ.42.79 కోట్ల లోన్ తీసుకుని ఎగవేత కేసులోనూ దోషిగా తేలిన ఆమెకు 2022లో సీబీఐ కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. ఆమె కొన్నాళ్ల పాటు జైలు శిక్ష అనుభవించి బెయిల్‌పై బయటకు వచ్చారు. అంతేకాకుండా గీత గిరిజన మహిళ కాదని, గిరిజనులకు కేటాయించిన అరకు ఎంపీ స్థానంలో ఆమె తప్పుడు కులధ్రువీకరణ పత్రంతో పోటీ చేసి గెలుపొందిందని ఆమె ప్రత్యర్థి హైకోర్టులో కేసులు దాఖలు చేశారు. 2024 జనవరిలో గీత ఎస్టీ కాదని రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ జారీ చేసింది. తక్షణమే ఆమె హైకోర్టును ఆశ్రయించింది. అయితే ప్రభుత్వ గెజిట్‌ను హైకోర్టు సస్పెండ్ చేసింది.

కడప నుంచి హైదరాబాద్ వరకు అదే తీరు



సీఎం రమేష్ కడప జిల్లా పొట్లదుర్తి గ్రామంలో జన్మించారు. ఓసీ వెలమ సామాజిక వర్గానికి చెందిన ఆయన టీడీపీ నుంచి రాజకీయ అరంగేట్రం చేశారు. చంద్రబాబుకు సన్నిహితంగా ఉంటూ 2012లో టీడీపీ రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ అయ్యారు. 2018లో రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా టీడీపీ నుంచి నామినేట్ అయ్యారు. 2019 జూన్ 20న బీజేపీలో చేరారు. ఈయన అక్రమాల బాగోతాలు అన్నీ ఇన్నీ కావు. 2019లో కడప జిల్లా ఎర్రగుంట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో కారు డ్రైవర్‌తో కలిపి తనపై దాడి చేశారని ఎర్రగుంట్లకు చెందిన పడిగపాటి వెంకట సుదక్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. దీనిపై ఐపీసీ 323, 324 కింద కేసులు నమోదు చేశారు. చిత్తూరు జిల్లాలో సారా వ్యాపారాలు చేశారు. అదేవిధంగా 2014-19లో గండికోట ప్రాజెక్ట్ పెండింగ్ పనుల్లో అవకతవకలు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. అలాగే ఆయనపై హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫోర్జరీ కేసు నమోదైంది. సీఎం రమేశ్‌కు చెందిన రిత్విక్ స్వాతి కంపెనీ ప్రధాన కార్యాలయంలో ఫోర్జరీ సంతకాలతో బోగస్ సబ్ కాంట్రాక్టు ఒప్పందం చేసుకొని రూ.450 కోట్లు కొట్టేశారనీ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సినీ నటుడు వేణు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఐపీసీ సెక్షన్లు 420, 468, 471 కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఇది కోర్టులో ఉంది.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన



ఎన్టీఆర్ విగ్రహం వద్ద పెట్టిన చంద్రబాబు వాల్‌పోస్టర్

ఎటపాక: మండల పరిధిలోని పురుషోత్తపట్టణంలో **టీడీపీ నేతలు** ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. ఆదివారం రాత్రి ఎన్టీఆర్ విగ్రహం వద్ద, సెంటర్లో బాస్ ఈజ్ బ్యాక్ అంటూ చంద్రబాబు నాయుడు ఫొటో ఉన్న వాల్‌పోస్టర్లను పెట్టారు. ఈ సమాచారం తెలుసుకున్న గ్రామ పంచాయతీ అధికారులు ఆ పోస్టర్లను తొలగించారు. టీడీపీ నేతలు కావాలనే ఈవిధంగా పోస్టర్లు పెట్టి వివాదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఇతర పార్టీల నాయకులు చెబుతున్నారు.

మే 5 నుంచి ముత్యాలమ్మ ఉత్సవాలు



ఉత్సవ తేదీలను వెల్లడిస్తున్న కమిటీ సభ్యులు

చింతపల్లిరూరల్: మండల కేంద్రం చింతపల్లిలో అత్యంత వైభవంగా నిర్వహించే ముత్యాలమ్మ తల్లి ఉత్సవాలను మే 5,6,7,8 తేదీల్లో జరపనున్నారు. ఉత్సవాల నిర్వహణకు నూతన కమిటీని సోమవారం ఎంపిక చేశారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో కమిటీ అధ్యక్షుడిగా పసుపులేటి వినాయకరావు, ప్రధాన కార్యదర్శిగా పెదిరెడ్ల బేతాళుడు, కోశాధికారిగా గసడా పద్మనాభాన్ని ఎన్నుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ముత్యాలమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్తకసంఘం, పలు రకాల యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యాభి వృద్ధిరస్తు

విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్య, వసతి దీవెన లబ్ధి వారికి అక్కరకు వస్తున్నాయి. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఎంబీబీఎస్, డిప్లమో వంటి కోర్సులు చదివే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు, అగ్రవర్ణ పేదలకు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగేందుకు ప్రభుత్వం పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తోంది. దీనికి తోడు జగనన్న వసతి దీవెన పేరుతో రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకూ ఆర్థిక సాయం అందిస్తోంది. ప్రభుత్వ సహకారం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థుల ఉన్నత విద్య కల నెరవేరుతుందంటూ ఆయా వర్గాల విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- జగనన్న విద్య, వసతి దీవెనతో ఉన్నత చదువుకు భరోసా
- పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ధైర్యంగా చదువులు
- పేద విద్యార్థులకు విదేశాల్లో ఉచితంగా చదువు

సాక్షి,పాడేరు/రంపచోడవరం/సీలేరు : జగనన్న విద్య, వసతి దీవెన పథకాలు పేద విద్యార్థుల ఉన్నత చదువులకు భరోసాగా నిలుస్తున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చదువులకు ఆటంకం లేకుండా ఏటా క్రమం తప్పకుండా విద్యార్థుల తల్లి బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేస్తోంది. పాడేరు ఐటీడీఏ పరిధిలో రూ.36.50 కోట్లు, అల్లూరి సీతారామరాజు జిల్లా ఆవిర్భావం తరువాత రూ.30.71 కోట్లు ఆర్థిక సాయం అందించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, ఈబీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులకు అర్హతే కొలమానంగా ఉన్నత చదువులకు అయ్యే పూర్తి ఖర్చు ప్రభుత్వమే భరిస్తోంది. ప్రభుత్వ గుర్తింపు విద్యా సంస్థల్లో డిప్లమో, డిగ్రీ, ఇంజనీరింగ్, పోస్టు గ్రాడ్యుయేషన్ వంటి కోర్సులు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా చదువుకునే అవకాశం కల్పిస్తోంది.



వసతి దీవెనతో ఆర్థిక దన్ను

పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం కాలేజీలకు చెల్లించాల్సిన ఫీజు మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తోంది. అంతేకాకుండా విద్యార్థులకు ఆర్థికంగా భరోసాగా నిలిచేలా వసతి దీవెన కూడా అందిస్తోంది. ఐటీఐ కోర్సు చేస్తున్న విద్యార్థులకు ఏడాదికి రూ. 10 వేలు, పాలిటెక్నిక్, ఇతర డిప్లమో కోర్సుల వారికి రూ.15 వేలు, డిగ్రీ ఆపై కోర్సుల చదివే విద్యార్థులకు రూ.20 వేలు చొప్పున జగనన్న వసతి దీవెన పథకం కింద అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తుండటంతో విద్యార్థుల్లో ఆనందం వెల్లివిరిస్తోంది.

నాడు ఏ కోర్సుకైనా రూ.35 వేలు మాత్రమే..

దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా కొనసాగించారు. అయితే ఏ కోర్సు చదివినా, ఏడాదికి రూ.35 వేలు మాత్రమే ఇచ్చారు. అది కూడా సవ్యంగా ఇవ్వకపోగా, ఇచ్చే వాటిని కూడా కాలేజీలకు చెల్లించడంతో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం అయ్యేవి. తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థులు సొంతంగా ఫీజు చెల్లించాల్సిన దుస్థితి నాడు ఉండేది.

విదేశాల్లోనూ చదువులు ఫ్రీ

విదేశాల్లో చదువుకునే వారికి సైతం ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందిస్తోంది. జగనన్న విద్యాదీవెన పథకం కింద ప్రపంచ వ్యాప్తంగా టాప్ 50 యూనివర్సిటీల్లో సీటు పొందే అర్హులైన విద్యార్థులకు ట్యూషన్ ఫీజును ప్రభుత్వం చెల్లిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకైతే రూ.1.25 కోట్లు, ఇతరులకు రూ. కోటి వరకు మంజూరు చేస్తోంది.

పాడేరు ఐటీడీఏ పరిధిలో

సంవత్సరం	విద్యాదీవెన పొందిన విద్యార్థులు	మంజూరైన మొత్తం (రూ. కోట్లలో)	వసతి దీవెన పొందిన విద్యార్థులు	మంజూరైన మొత్తం (రూ. కోట్లలో)
2019-20	6,321	8.87	2,219	2.11
2020-21	7,649	7.79	4,023	3.90
2021-22	13,297	9.78	4,130	4.05
మొత్తం	27,267	26.44	10,372	10.06
జిల్లా ఏర్పడిన తరువాత				
2022-23	13,578	17.31	7,550	7.25
2023-24	12,457	6.15	----	----
మొత్తం	26,035	23.46	----	----

పథకాలతో సాఫీగా చదువులు



నా పేరు కిల్లో వెంకటలక్ష్మి. మాది జీకే వీధి మండలం సీలేరు గ్రామం. మా తల్లిదండ్రులు కిల్లో ధార బాబు, పోతి. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి మాది. నాకు కృష్ణ, లైకోన్ అనే ఇద్దరు సోదరులు ఉన్నారు. మమ్మల్ని బాగా చదివించాలన్నది మా తల్లిదండ్రుల ఆశ. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాకు ఎంతో మేలు జరిగింది. పెద్దన్నయ్య డిగ్రీ,చిన్న అన్నయ్య విశాఖపట్నం కొమ్మాదిలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు.జగనన్న విద్యాదీవెన పథకం లైకోన్‌కు అపద్బాంధవిగా మారింది. రెండేళ్లలో రూ.90 వేలు జమ అయింది. నాకు కూడా జగనన్న అమ్మఒడి పథకంకింద మూడేళ్లలో రూ.45 వేలు అందాయి. రాష్ట్ర ప్రభుత్వ పథకాల వల్ల నాతో పాటు మా అన్నయ్యల చదువులు ఎటువంటి ఆటంకం లేకుండా సాఫీగా సాగుతున్నాయి.

జగనన్న చలవ వల్లే ఇంజనీరింగ్ చదువుతున్నాను



నా పేరు భార్గవి. మాది వీఆర్ పురం మండలం రేఖపల్లి గ్రామం. పేద కుటుంబం కావడంతో తల్లిదండ్రులు కష్టపడితేగాని రోజు గడవని పరిస్థితి. కుటుంబంలో ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాకు ఎంతో మేలు చేసింది. పాలిటెక్నిక్ చదివి రంపచోడవరం లెనోరా ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంత్సరంలో చేరాను. ప్రస్తుతం ఆఖరి సంవత్సరం చదువుతున్నాను. జగనన్న విద్యదీవెన ద్వారా ప్రతి ఏడాది రూ. 35వేలు వస్తోంది. బీటెక్ రెండేళ్లకు రూ.70 వేలు వచ్చింది. ఆఖరి సంవత్సరం కూడా విద్య దీవెన వస్తుంది. జగనన్న ఆశీస్సులతో బీటెక్ పూర్తి చేసి, మంచి ఉద్యోగంలో చేరి కుటుంబానికి చేదోడుగా నిలుస్తాను.

విద్యాదీవెనతో డిప్లమో పూర్తి చేశాను



నా పేరున గోగాడ మోహన్‌కుమార్. తుమ్మపాల మండలం గురజాడనగర్‌లో ఉంటున్నాం. బీటెక్ మొదటి ఏడాది చదువుతున్నాను. మా నాన్న ఈశ్వర రావు పెట్రోల్ బంక్‌లో పనిచేస్తారు. నాతో పాటు చెల్లి ఉంది. ఇద్దరిని చదివించలేక పదో తరగతి తరువాత ఒకరి చదువు ఆపేద్దామని నాన్న అనుకున్నారు. ఇంజినీరింగ్ చేయాలనేది నాకల. ఆ సమయంలో జగనన్న ప్రభుత్వం విద్యా దీవెన పథకం ప్రకటించింది. డిప్లమోలో చేరాను. ప్రతి సెమిస్టర్‌కు రూ.6 వేల చొప్పున ఏడాదికి రూ.25 వేల వరకు నా బ్యాంకు ఖాతాకు ప్రభుత్వం జమ చేసింది. డిప్లమో మొత్తం రూ.75వేలు అందాయి. ఈ ఏడాది బీటెక్‌లో జాయిన్ అయ్యాను. ఇంజినీరింగ్ చేయాలనే నా కల విద్యాదీవెనతో నెరవేరుతుంది. నా చెల్లి కూడా ఈ ఏడాది డిప్లమోలో చేరింది.

సంగమేశ్వరస్వామి ఆలయం ప్రారంభం

- తొలి పూజ నిర్వహించిన శారదా పీఠాధిపతి స్వరూపనందేంద్ర స్వామి
- భారీగా తరలివచ్చిన భక్తులు

సాక్షి,పాడేరు: మారుమూల సంగోడి గ్రామంలో దేవదాయశాఖ నిధులతో నూతనంగా నిర్మించిన సిద్ధి సంగమేశ్వరస్వామి ఆలయం సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. శారదా పీఠాధిపతి స్వరూపనందేంద్ర సరస్వతి స్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆలయాన్ని ప్రారంభించి, ఆలయంలో స్ఫటిక శివలింగానికి తొలిపూజ చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన వేదపండితులు శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు చేసి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా గ్రామం ఓం నమఃశివాయ నామస్మరణతో మార్మోగింది.

స్వరూపనందేంద్ర స్వామికి ఘన స్వాగతం

సంగమేశ్వర ఆలయం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా వచ్చిన స్వరూపనందేంద్ర సరస్వతి స్వామికి గిరిజనులు ఘన స్వాగతం పలికారు. గిరిజన సంప్రదాయం పద్ధతుల్లో హారతులిచ్చి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అక్కడ ఈశ్వరీయ బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక శిబిరాన్ని స్వామీజి ప్రారంభించారు. స్థానిక గిరిజనులతో పాటు పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులను ఆశీర్వదించారు. అనంతరం ప్రవచిస్తూ పరమ శివుడు అనుగ్రహంతోనే లోక కల్యాణం జరుగుతుందని,ప్రజలంతా సంతోషంగా జీవిస్తారని తెలిపారు. పాడేరు మండలంలోని మారుమూల గ్రామ మైన సంగోడిలో సంగమేశ్వర ఆలయాన్ని నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. గిరిజన ప్రాంతాలలో సనాతన ధర్మం పరిరక్షణ లక్ష్యంగా శారదా పీఠం ఆధ్యాత్మిక కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా స్వామీజిని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ,ఆమె కుమారుడు చెట్టి వినయ్,అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మా తనూజరాణి కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.



సిద్ధి సంగమేశ్వరస్వామి ఆలయంలో పూజ చేస్తున్న శారదా పీఠాధిపతి స్వరూపనందేంద్రస్వామి



బ్రహ్మకుమారీలతో మాట్లాడుతున్న శారదా పీఠాధిపతి స్వరూపనందేంద్రస్వామి

ఆనందాల కేళి

- జిల్లాలో అంబరాన్నంటిన హోలీ సంబరాలు
- తాజంగి, కొండపడ గ్రామాల్లో హోలీ టవర్లను దహనం చేసిన గ్రామస్తులు
- రంగులు జల్లుకుని సందడి చేసిన యువత



ముంచంగిపుట్టులో ఉట్టి కొట్టేందుకు పోటీ పడుతున్న యువకులు



జెండా పట్టుకున్న వ్యక్తులను సన్మానిస్తున్న గ్రామస్తులు





హోలీ సందర్భంగా తాజంగి, కొండపడ గ్రామాల్లో దహనం చేసిన హోలీ టవర్లు

చింతపల్లిరూరల్/ముంచంగిపుట్టు: జిల్లాలో పలు గ్రామాల్లో సోమవారం హోలీ సంబరాలు అంబరానంటాయి. రంగులు జల్లుకుని చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ సందడి చేశారు. కొన్ని ప్రాంతాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. చింతపల్లి, ముంచంగిపుట్టు మండలాల్లో విభిన్నంగా ఈ ఉత్సవాలు జరిపారు. చింతపల్లి మండలం తాజంగిలో రాధాకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు,అభిషేకాలు చేశారు. ఆదివారం రాత్రి రాధాకృష్ణుల విగ్రహాలను భజనలు, సంకీర్తనలతో ఊరేగించారు. ఆలయం ఎదుట 60 అడుగుల ఎత్తైన కర్రల పోగు(హోలీ టవర్)ను నిర్మించి, చివరన జెండాను అమర్చి సోమవారం తెల్లవారుజామునా 4 గంటల సమయంలో దహనం చేశారు. దహనం అనంతరం ఈ కర్రల పోగు చివరన అమర్చిన జెండా ఏ దిక్కుకు పడుతుందో అటు వైపు పంటలు బాగా పండి అధిక దిగుబడులు వస్తాయని ఆ గ్రామస్తుల నమ్మకం. రాజేంద్రపురం గ్రామానికి చుట్టం చూపుగా వచ్చిన ముంచంగిపుట్టు మండలం వనుగుమ్మ గ్రామస్తుడు గోళ్లురి రాము, తాజంగి పంచాయతీ రాజేంద్రపురానికి చెందిన వంతల శ్రీనివాసరావు అనే ఇద్దరు వ్యక్తులు దహనం అనంతరం కిందపడుతున్న జెండాను పట్టుకున్నారు. వారిద్దరికీ కలిపి గ్రామస్తులు రూ.1,116 బహుమతిగా అందజేసి, ఊరేగించి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనూషదేవి, సర్పంచ్ వంతల మహేశ్వరి, ఉత్సవ కమిటీ సభ్యులు జలంధర్, సోమరాజు, లవకుశ, భగవాన్, బాబూరావు, సదాశివ, రాజారావు, శ్రీరామ్ పాల్గొన్నారు. ముంచంగిపుట్టు మండల కేంద్రంతో పాటు కొండపడ, దారెల గ్రామాల్లో ఆదివారం రాత్రి రాధాకృష్ణుల విగ్రహాలకు గిరిజన సంస్కృతి,సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించి, థింసా నృత్యాలు చేసి సందడి చేశారు. సోమవారం ఉదయం కొండపడ గ్రామంలో కర్రల పోగు కాల్చే ఉత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఈ ఉత్సవాన్ని తిలకించారు. పలుగ్రామాలో రంగులు జల్లుకుని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముంచంగిపుట్టులో యువకులు ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు.

28న బోడిదొర సంస్మరణ సభ



బోడిదొర చిత్రపటం, బ్యానర్లను అందజేస్తున్న వీరభద్రరావు

కొయ్యూరు: ప్రముఖ స్వతంత్ర సమరయోధుడు గాం మల్లుదొర మనువడు బోడిదొర సంస్మరణ సభకు అందరూ తరలిరావాలని జాతీయ అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు కోరారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 28న బోడిదొర స్వగ్రామం లంకవీధిలో సంస్మరణ సభను సందర్భంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులు, స్థానికులు తరలి రావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన బోడిదొర చిత్రపటం, రెండు బ్యానర్లను కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఇసుక కొండకు పోటెత్తిన భక్తులు

డాబాగార్డెన్స్: నగరంలోని ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. హోళీపౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. వేకువ జాము 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. నగరం నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు.

అప్పన్నకు పెళ్లి కుదిరింది

- వచ్చే నెల 9న ఉగాది రోజు పెళ్లిరాట
- 19న వార్షిక కల్యాణోత్సవం



బుగ్గన చుక్కతో పెళ్లికొడుకుగా అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి



భక్తులపై రంగులు జల్లుతున్న అర్చకుడు

సింహాచలం: సింహాద్రి అప్పన్న స్వామికి పెళ్లి కుదిరింది. సింహగిరి నుంచి కొండ దిగువకు దిగొచ్చి తనకు పిల్లనివ్వాలని సోదరి, అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారిని స్వామి అర్థించాడు. ఏమి చూసి నీకు పిల్లనివ్వాలని తొలుత నిరాకరించిన పైడితల్లి అమ్మవారు.. ఆ తర్వాత స్వామికి ఉన్న వైభవాన్ని, భక్తజన సందోహాన్ని చూసి ఆశ్చర్యపోయింది. చివరకు పిల్లనివ్వడానికి అంగీకరించింది. దీంతో వచ్చే నెల 9న ఉగాది రోజు పెళ్లిరాట ఉత్సవం, 19న చైత్ర ఏకాదశిని పురస్కరించుకుని వార్షిక కల్యాణోత్సవానికి శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి సిద్ధమవుతున్నాడు.

ఘనంగా డోలోత్సవం

ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి డోలోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. తనకు పిల్లనివ్వాలంటూ సోదరి పైడితల్లి అమ్మవారిని స్వామివారు అర్థించే విధానాన్నే అడవివరం గ్రామస్తులు బొట్టినడిగే పున్నమి ఉత్సవం(డోలోత్సవం)గా అభివర్ణిస్తారు. స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా సింహగిరిపై నుంచి పల్లకిలో మెట్ల మార్గం ద్వారా ఉదయం 7 గంటలకు తొలి పావంచా వద్దకు తీసుకొచ్చారు. స్వామిని ఊరేగింపుగా పైడితల్లి అమ్మవారి ఆలయం వద్దకు తీసుకెళ్లి హారతులు పట్టారు. తరువాత స్వామిని పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొచ్చి ఉద్యాన వన మండపంలో ఏర్పాటు చేసిన డోలీలో అధిష్టింపజేసి, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. పూజలు చేసిన వసంతాలను అర్చకులు స్వామికి సమర్పించారు. అనంతరం డోలోత్సవం నిర్వహించి, వసంతాలను అర్చకులు భక్తులపై చల్లారు. స్వామికి పెళ్లికుదిరిన ఆనందంలో దేవస్థానం ఉద్యోగులు, భక్తులంతా ఒకరిపై ఒకరు వసంతాలను చల్లుకుని ఆనంద డోలికల్లో మునిగితేలారు. పెళ్లి కొడుకు అలంకరణలో తిరువీధిగా వచ్చిన అప్పన్న స్వామికి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో స్వాగతం పలికి మంగళ హారతులిచ్చారు. తరువాత స్వామిని మళ్లీ పైడితల్లి ఆలయానికి తీసుకెళ్లి అక్కడి నుంచి సింహగిరికి తరలించారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, సువ్వాడ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్లంటే చంద్రబాబు, పవన్‌కు భయం



విలేకరులతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం, నాయకులు

అరకులోయటౌన్: గ్రామ వలంటీర్లంటే చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌కు గుండెల్లో రైలు పరుగెడుతాయని, భయమని వైఎస్సార్‌సీపీ అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు నిస్వార్థ సేవలందించే గ్రామ వలంటీర్లపై చంద్రబాబునాయుడు, దత్త పుత్రుడు పవన్ కళ్యాణ్ కించపరిచే విధంగా మాట్లాడుతున్నారన్నారు. తాము అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థ నడుం విరగొడతామని బెదిరింపు వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. మధ్యవర్తిత్వం లేకుండా ప్రజలకు నేరుగా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని అక్కసుతో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారన్నారన్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించి ఔదార్యం చాటిన గ్రామ వలంటీర్ల సేవలను ప్రజలు మరువలేదని, గుర్తించారని, ఈ విషయాన్ని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ అండ్ కో తెలుసుకోవాలని ధ్వజమెత్తారు. వారు చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనుక్కి తీసుకొని వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందన్నారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు తగదు



జీకే వీధిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరాజు, ఎన్నికల పరిశీలకులు శ్రీకాంత్, వెంకటలక్ష్మి, నాయకులు

గూడెంకొత్తవీధి: రాష్ట్రంలో మహిళల అదృశ్యానికి వలంటీర్లే కారణం అంటూ పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను తామంతా తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మత్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు శ్రీకాంత్, వెంకటలక్ష్మి పార్టీనాయకులతో కలసి వారు సోమవారం గూడెంకొత్తవీధిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. జగనన్న పాలనలో ప్రభుత్వ సేవలను నిస్వార్థంగా ప్రజలకు అందిస్తూ మన్ననలు పొందిన గ్రామ వలంటీర్లు గురించి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు దారుణమన్నారు. పొత్తులతో కుమ్మక్కై కుట్ర రాజకీయాలు చేస్తున్న పవన్ కళ్యాణ్ గ్రామ వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా వెంకన్న కల్యాణం



స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ఎటపాక: గోవిందుని నామస్మరణతో వేంకటేశ్వర స్వామి ఆలయం మార్మోగింది. వెంకటరెడ్డిపేటలో కొలువైన అలమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం హోలీ పౌర్ణమి సందర్భంగా సోమవారం వైభవంగా జరిగింది. స్వామి కల్యాణాన్ని తిలకించేందుకు సరిహద్దున ఉన్న తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాల నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆలయం నుంచి అలమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారిని పల్లకిపై ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపానికి వేదమంత్రోచ్చారణల నడుమ తీసుకొచ్చారు. ముందుగా ఎటువంటి విఘ్నాలు కలుగకుండా విశ్వక్సేన పూజ నిర్వహించి స్థలశుద్ధి, కల్యాణ మూర్తుల శుద్ధికి పుణ్యాహవచన కార్యక్రమాన్ని జరిపారు. అనంతరం కన్యావరణం, యజ్ఞోపవిత ధారణ చేసి, పూజలు జరిపారు. కల్యాణంలో ముఖ్య ఘట్టమైన జీలకర్ర, బెల్లం పెట్టిన తర్వాత మాంగల్య ధారణ జరిపించారు. తరువాత నూతన వధూవరులు తలంబ్రాలు పోసుకునే కార్యక్రమం కనుల విందుగా జరిగింది. ఈకల్యాణాన్ని అర్చకులు చక్రవర్తుల వేంకట రఘుపుంగవాచార్యులు, గొట్టుపుల్ల రాజగోపాలాచార్యులు, పాడిచేటి అభిరామ చార్యులు, వరుణ్‌రామాచార్యులు నిర్వహించారు.

జగనన్నను గెలిపిద్దాం.. సంక్షేమం సాధిద్దాం

ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టిన రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి



ములగలపూడిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

వై.రామవరం: మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసి, మరింత సంక్షేమాభివృద్ధి సాధిద్దామని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. ఆమె మండలంలో సోమవారం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మండలంలోని యర్రంరెడ్డిపాలెం, కోట, కె.యర్రగొండ పంచాయతీల పరిధిలోని సుమారు 15 గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులకు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న ఆశీస్సులతో, ఎమ్మెల్సీ అనంతబాబు సారథ్యంలో ఎన్నికల ప్రచార ప్రక్రియను ప్రారంభించామన్నారు. చంద్రబాబు బూటకపు హామీలను నమ్మి మోసపోవద్దన్నారు. చంద్రబాబు గతంలో ఎన్నికల హామీలు ఇచ్చి, ప్రజలను మోసగించారని, మళ్లీ కుట్రపూరిత రాజకీయకక్షలతో అబద్ధపు హామీలతో మళ్లీ మోసం చేసేందుకు పన్నాగం చేస్తున్నారన్నారు. చంద్రబాబుది ధనికులకు అనుకూలమైన ప్రభుత్వమని, జగనన్నది పేదల ప్రభుత్వమన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ మంజూరు చేయాలంటే నాయకులకు, అధికారులకు డబ్బులు ఇవ్వాల్సి వచ్చేదని, అయినా పింఛన్ వచ్చేది కాదని, ఒకవేళ మంజూరైనా పాలకులు, నాయకులు, జన్మభూమి కమిటీలు కాజేసేవారని గుర్తు చేశారు. జగనన్న పాలనలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా నేరుగా లబ్ధిదారుని ఇంటికే పింఛన్ అందజేస్తున్నారన్నారు. జగనన్న ప్రభుత్వ పాలనలో మండలానికి లబ్ధి చేకూర్చిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని వివరించారు. పేద ప్రజలకు న్యాయం జరగాలంటే రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించి, జగనన్నను తప్పనిసరిగా మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఆమె పిలుపునిచ్చారు. అలాగే రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నాగులపల్లి ధనలక్ష్మిను, అరుకు పార్లమెంటరీ నియోజకవర్గం ఎంపీగా పోటీ చేస్తున్న డాక్టర్ గుమ్మ తనూజరాణీతో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనకు ఓటు వేయాలని గ్రామస్తులను అభ్యర్థించారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు ముర్ల జోగిరెడ్డి, వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్‌లు, నాయకులు భారతిబాబు, మడి బాబి, రమేష్, కనకరాజు, తిరుపతిరెడ్డి, సుజానమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేడుకలో విషాదం

- యువకుల మధ్య ఘర్షణ
- కత్తిపోట్లతో టెన్త్ విద్యార్థి దుర్మరణం
- మరో ఇద్దరికి గాయాలు



గాయపడిన యువకుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు



కత్తిపోట్లతో మృతి చెందిన అజ్మీర సాయికుమార్

ఎటపాక: వెంకటరెడ్డిపేటలో సోమవారం జరిగిన స్వామి వారి కల్యాణ మహోత్సవంలో విషాద ఘటన చోటు చేసుకుంది. యువకుల మధ్య జరిగిన ఘర్షణ కత్తిపోట్లకు దారితీసింది. ఎటపాక సీఐ రామారావు, ఎస్ఐ పార్థసారథి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎటపాక మండలం రామగోపాలపురం తండాకు చెందిన అజ్మీర సాయికుమార్(15) వెంకటరెడ్డిపేటకు చెందిన మరో ఇద్దరు స్నేహితులతో కలిసి స్వామి వారి కల్యాణం తిలకించేందుకు వెళ్లారు. జాతరలో భాగంగా జరిగిన అన్న సంతర్పణకు సమీపంలోని పొలంలో భద్రాచలం పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు భోజనం చేస్తున్నారు. ఆ సమయంలో సాయికుమార్ స్నేహితుల్లో ఒకరు వాటర్ బాటిల్ తీసుకుని అటుగా బహిర్భూమికి వెళ్లాడు. దీంతో భోజనం చేస్తున్న యువకులు బాటిల్ లాక్కున్నారు. దీంతో ఆ యువకుడు అక్కడి నుంచి వెళ్లి తన స్నేహితులతో తిరిగి రావడంతో రెండు వర్గాల మధ్య గొడవ జరిగినట్లు ఎస్ఐ తెలిపారు. ఘర్షణ పెద్దదై భద్రాచలంకు చెందిన యువకులు వారి వెంట తెచ్చుకున్న కత్తితో సాయికుమార్, కొరిమి సాయి, నెర్రబోయిన శ్రీనుపై దాడి చేసి పరారయ్యారు. ఈ దాడిలో సాయికుమార్ చాతీ, పొట్టలో కత్తిపోట్లు దిగడంతో అక్కడికక్కడే మరణించాడు. మిగతా ఇద్దరు యువకులు కూడా స్వల్ప కత్తిపోట్లకు గురయ్యారు. వారిని ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతి చెందిన సాయికుమార్, కొరిమి సాయి నెల్లిపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి చదువుతూ గౌరిదేవిపేట పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాస్తున్నారు. శ్రీను ఇంటర్ చదువుతున్నాడు. మృతుడు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో సీఐ, ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. దాడి చేసిన యువకులను పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చేపట్టారు. నిందితులు గంజాయి మత్తులో ఉన్నట్లు సమాచారం.

పోక్సో కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

రాజవొమ్మంగి: పోక్సో కేసులో మండలంలోని మారేడుబాక గ్రామానికి చెందిన చిట్టోజి లోవరాజుకు పోక్సో స్పెషల్ కోర్టు(కాకినాడ) జడ్జి ఎల్.వెంకటేశ్వరరావు పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. సోమవారం స్థానిక సీఐ సన్యాసినాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిందితుడు లోవరాజు అదే గ్రామానికి చెందిన బాలికపై ఎవరూ లేని సమయంలో అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఆమె ప్రతిఘటించడంతో కత్తితో దాడి చేసి పరారయ్యాడు. ఈ ఘటనపై బాధిత బాలిక ఆగస్టు 3, 2018న జడ్డంగి స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ టి.గోపీనరేంద్రప్రసాద్ పోక్సో చట్టం 2012 ప్రకారం కేసు నమోదు చేశారు. సమగ్ర దర్యాప్తు అనంతరం కోర్టు చార్జిషీట్ ఓపెన్ చేసింది. విచారణలో జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పితాని శ్రీనివాసరావు ప్రాసిక్యూషన్ తరఫున బలమైన వాదనలు వినిపించారు. విచారణ అనంతరం నిందితుడికి శిక్ష పడింది. కేసు పురోగతికి తోడ్పడిన రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు, జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు, హెచ్‌సీ కోటేశ్వరరావు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా నుంచి ప్రశంసలు అందుకున్నారు.

వైభవంగా రథోత్సవం



డొంకరాయి కుమారస్వామి రథోత్సవంలో శూలాలతో భక్తుడు

మోతుగూడెం: వై రామవరం మండలం బొడ్డుగండి పంచాయతీ డొంకరాయి గ్రామంలో కుమారస్వామి రథోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కుమారస్వామి మాల ధరించిన భక్తులు శరీరం, నాలుకపై శూలాలు గుచ్చుకొని భక్తిని చాటుకున్నారు. కుమారస్వామి విగ్రహానికి సీలేరు నదిలో స్నానం చేయించి డొంకరాయి వీధుల్లో ఊరేగించారు. అనంతరం వేలమంది భక్తులకు అన్న సమాధానం నిర్వహించారు. స్థానిక ఎస్ఐ శివకుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

సంగమేశ్వర స్వామికి ఐటీడీఏ పీవో పూజలు



సంగమేశ్వరస్వామికి పూజలు చేస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: సంగోడి గ్రామంలోని సంగమేశ్వర స్వామిని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సోమవారం దర్శించుకున్నారు. శివాలయం ప్రారంభంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఆలయ అర్చకులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శివలింగంనకు ఆయన ప్రత్యేక పూజలు జరిపారు.

సారా స్వాధీనం- ఇద్దరి అరెస్టు



సారా నిందితులతో ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది

జి.మాడుగుల: నాటుసారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీస్‌లు అరెస్టు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీనివాస్ సోమవారం అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో కుంబిడిసింగి పంచాయతీకి అండంగిసింగి గ్రామానికి చెందిన సీదరి బాలన్న, ముంచంగి బాబూరావు ఇద్దరు కలిసి రెండు టిన్‌ల్లో 20 లీటర్లు సారా తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు సంగం జంక్షన్ వారిని పట్టుకున్నట్టు ఆయన తెలిపారు. సారాను స్వాధీనం చేసుకొని ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్టు ఆయన తెలిపారు.

సీతపల్లిలో ఘనంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



సీతపల్లి గ్రామంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న భక్తులు

రంపచోడవరం: మండలంలోని సీతపల్లిలో కలుముల వీర్రాజు, భారతి దంపతుల ఆర్థిక సాయంతో 11 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని సోమవారం ప్రతిష్ఠించారు. గిరిజన పూజారులు పల్లాల ఈశ్వర్ రెడ్డి, గూట్టేటి కృష్ణారెడ్డి ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు. 101 బిందెల నీళ్లతో స్వామివారికి జలాభిషేకం చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సంయోజక్ గుడ్ల అంక శ్రీనివాసరెడ్డి, ప్రచారక్ కారం చెల్లన్న దొర పాల్గొన్నారు.

అమ్మవారి గరగ సంబరాలు ప్రారంభం



రాజవొమ్మంగిలో గరగ నృత్యాలు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని నూకాలమ్మ అమ్మవారి ఉత్సవాలు సోమవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఏటా కొత్త అమావాస్యకు 15 రోజుల ముందు అమ్మవారి ఆలయ గుడి తలుపులు తెరచి గరగలు బయటకు తీస్తారు. అమ్మవారి ప్రతి రూపాలైన గరగలు తొలుత పుట్టింటికి చేరుకొంటాయి. అక్కడ నుంచి ప్రతి రోజు పురవీధుల్లో ఊరేగుతాయి. నూకాలమ్మ అమ్మవారి తిరునాళ్లు ఏప్రిల్ 6, 7, 8 తేదీల్లో జరిపేందుకు ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ మూడు రోజుల్లో జాగారాల్లో వివిధ కళా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే గుడికి రంగులు వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. చలువ పందిర్లు వేశారు. ఈ తిరునాళ్లకు వేలాదిగా వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కమిటీ చర్యలు చేపట్టింది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



అనకాపల్లి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేటు సమీపంలో 50–60 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ పోలీసులకు సోమవారం ఫిర్యాదు అందింది. రెండు వారాలుగా ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో తిరుగుతూ ఉండే అతడు మృతి చెందినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించామన్నారు. మృతుని సంబంధీకులు వివరాలకు 9491930675 సంప్రదించాలని సూచించారు.